పకడ్బందీగా తనిఖీలు చేయాలి

- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లెల్ల చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ

సిరిసిల్ల రూరల్: జిల్లెల్లలో చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల రూరల్, మార్చి29: చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ, పకడ్బందీగా వాహనాలను తనిఖీలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని చెక్‌పోస్టును ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ₹50వేలకు మించి నగదు తీసుకెళ్లితే సీజ్ చేస్తామన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ సుధాకర్, తదితరుల ఉన్నారు.

రుద్రంగిలో ₹55వేలు పట్టివేత

రుద్రంగి, మార్చి 29: మండల కేంద్రంలో నిని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం బైక్‌పై వెళ్తున్న ఒకరిని తనిఖీచేయగా, అతడివద్ద ₹55,340 పట్టుకున్నామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అలాగే మరొకరు మద్యం తరలిస్తుండగా, పట్టుకొని స్క్రీనింగ్ కమిటీకి అందించామని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిత్యం అప్రత్తమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐ అశోక్, సిబ్బంది ఉన్నారు.

వేములవాడలో తనిఖీలు

వేములవాడ, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం వేములవాడ నందికమాన్ చౌరస్తా వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఇక్కడ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ సంతు, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, వీడియోగ్రాఫర్ రాజయ్య, తదితరులు ఉన్నారు.

రుద్రంగి: చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పక్కన జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు

వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్
- మండల యూత్ నాయకులతో సమావేశం

ఇల్లంతకుంట, మార్చి 29: బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల యూత్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమకారుడు, విద్యావంతుడు వినోద్‌కుమార్‌కు భారీ మెజార్టీ అందించాలని విజ్ఞప్తి చేశారు. మనోరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రైల్వేలైన్‌తోపాటు కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు వినోద్‌కుమార్ కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు నయా పైసా కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. కరీంనగర్ అభివృద్ధి సాధించాలంటే మరోసారి వినోద్‌కుమార్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యువ నాయకులు జక్కుల నాగరాజు, ఏనుగు రవీందర్‌రెడ్డి, సాదుల్, చందన్, అనిల్‌కుమార్, పట్నం శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, రఘు, భాస్కర్, మధు, రమేశ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జవ్వాలి విమల

రాజన్న సిరిసిల్ల, మార్చి29 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు వంద రోజుల్లో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జవ్వాజి విమల విమర్శించారు. జీవనభృతి ₹4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులందరికీ ₹4వేల పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పింఛన్ల కోసం అర్హులంతా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతినెలా పింఛన్లు కూడా సరైన సమయంలో ఇవ్వడంలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రతినెలా పింఛన్లు ఇవ్వడంతో వృద్ధులు, ఒంటరి మహిళలకు ఆసరా అయ్యిందన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, సకాలంలో పింఛను రాక పోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అభయహస్తం, మహిళా సంఘాలకు వడ్డీ పైసలు కూడా ఇంత వరకు విడుదల చేయలేదన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ సూరం పద్మ, వడ్ల లక్ష్మి, తదితరులు ఉన్నారు.

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి

సిరిసిల్ల, మార్చి 29: సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు పదోన్నతులు పొందాలంటే టెట్ తప్పనిసరి అనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు టెట్ ఫీజు మినహాయించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పిట్టల దేవరాజు, ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, పీ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ లచ్చయ్య కే నరేందర్, ముకేశ్, ఎల్లయ్య, ప్రవీణ్‌నాయక్, సుధీర్, రాము, లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కొంగల వెంకటి

టెండర్ల నిర్వహణ

వేములవాడ రూరల్, మార్చి 29: శ్రీరామనవమిని పురస్కరించుకొని అగ్రహారం హనుమాన్ ఆలయంలో సీల్డ్ టెండర్లను ఏప్రిల్ 2న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతి పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో తడకల పందిళ్లు, క్యూలైన్ల ఏర్పాటు, పూల అలంకరణ, వంటపాత్రలు, టెంట్లు, రంగులు వేసేందుకు, వంట మనిషి, కూలీలకు షీల్డ్ టెండర్లు నిర్వహిస్తున్నామని ఆసక్తి గల వారు టెండర్లు పాల్గొనాలన్నారు.

వైభవంగా శివకల్యాణ మహోత్సవాలు

ఆలయ అద్దాల మండపంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, మార్చి 24: వేములవాడ రాజన్న ఆలయంలో శివకల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం స్వామివారికి స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జంగమయ్య చెప్పిన శరభ గద్యాలతో రాజన్న ఆలయం దద్దరిల్లింది. కాగా, శనివారం రథోత్సవంపై ఆది దంపతులు పురవీధుల గుండా విహరిస్తారని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. రాత్రి 8గంటలకు ఆలయ అద్దాల మండపంలో స్వామివారి శృంగార వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నజర్

- విద్వేషకర పోస్టులు పెడితే చర్యలు
- ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణ చౌక్, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోషల్‌మీడియాపై ప్రత్యేక దృష్టిసారించామని, మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహజన్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు,యువత సోషల్ మీడి యా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధం గా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, ఫొటోలు షేర్ చేయవద్దని కోరా రు. అనవసర మెసేజ్‌లు పెట్టి ఇబ్బందులకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పోస్టు లు పార్వర్డ్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్‌శాఖ తరపున ఏర్పాట్లు చేశామన్నారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని, ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే వెంటనే తమ కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అఖిలపక్ష పార్టీ నేతలతో సమీక్ష

గంభీరావుపేట, మార్చి 29: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆయా పార్టీల నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేయవద్దన్నారు. ఎన్నికల ప్రచారం, పోలింగ్, తదితర ఎన్నికల కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ రామ్మోహన్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఆయా పార్టీల అధ్యక్షులు పాపాగారి వెంకట స్వామిగౌడ్, హమీద్, గంట అశోక్, ఎంపీటీసీ కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ముస్తాబాద్, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల నియమావళిపై అఖిలపక్ష పార్టీల నాయకులకు శుక్రవారం మండల కేంద్రంలోని మాతృశ్రీ గార్డెన్స్‌లో పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలను ఈసీ నిబంధనల మేరకు ప్రశాంతంగా పూర్తి చేసుకుందామని, ఇందు కోసం ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఇక్కడ ఎస్ఐ శేఖర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

మానకొండూర్ రూరల్, మార్చి 29: సభ్యులందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నదని ఊటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముద్దసాని ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడి ఆధ్వర్యంలో లక్ష్మీపూర్ గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో సంఘ పరిధిలో అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన బోనస్ రూ.500 అందేలా సొసైటీ సభ్యుల ఆమోదంతో త్వరలో తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. కొందరు రైతులు వివిధ సమస్యలను ప్రస్తావించగా, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీ పరిధిలోని పెట్రోల్ బంకును త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అంతకు ముందు సొసైటీ సీఈవో మిట్టపెల్లి రవీందర్ వార్షిక నివేదికను సభ్యులను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎడ్ల సతీశ్ కుమార్, డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ ఆధ్వర్యంలో అన్నదానం

విద్యానగర్, మార్చి 29: కరీంనగర్ జిల్లా ఆమోదిత చిట్ ఫండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినెలా జరిపే అన్నదాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా 250 మందికి భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వావిలాల పల్లె అభయాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు మధుసూదన్ రావు హాజరుకాగా, శ్రీ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం, సిబ్బంది, అసోసియేషన్ అధ్యక్షులు పెంట శ్రీనివాస్, కార్యదర్శి చీటి సత్యనారాయణ రావు, కోశాధికారి అల్లంకి రంజిత్ కుమార్, ముఖ్య సలహాదారు కొండ వేణుమూర్తి, కోమల్ రెడ్డి, రొంటాల రాంరెడి, శ్రీనివాస్, రాజిరెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై ప్రదర్శన

కలెక్టరేట్, మార్చి 29: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు చైతన్యం కల్పించడానికి సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ప్రదర్శనలు చేపట్టనున్నట్లు డీపీఆర్వో వంగరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాంస్కృతిక సారథి కళాకారులు రెండు టీములుగా ఏర్పడి ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంతోపాటు బోయినపల్లి మండలం దుండ్రపల్లిలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, మార్చి 29: ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు శుభాకాంక్షలు తెలిపారు.

సెస్ చైర్మన్ చిక్కాల పరామర్శ

నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావును పరామర్శిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 29: నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కడపత్రి ప్రకాశ్‌రావును సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ప్రకాశ్‌రావు తల్లి సావిత్రిబాయి ఇటీవల మృతి చెందగా, శుక్రవారం తంగళ్లపల్లి మండలం చీర్లవంచ పరిధిలోని నాయినోరిపల్లెలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పడిగెల రాజు, జక్కుల రవీందర్ ఉన్నారు. అదే విధంగా బీజేపీ నేత గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, మార్చి 29: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తండ్రి సీనియర్ న్యాయవాది మాకునూరి హన్మంత రావు మృతి చెందగా, పార్థివ దేహాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యేను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం, సిరిసిల్ల గారి సన్నిధిలో

యస్.ఓ.పి. నెం. 02/2024

అబ్బాసు రాములు ... పిటిషనర్

మరియు

1) శ్రీయుత మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాత ఆంధ్ర బ్యాంక్ ప్రక్కన, కోనరావుపేట బ్రాంచ్,
2) ఇన్ రే. ... రెస్పాండెంట్స్

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న పిటిషనర్ అయిన అబ్బాసు రాములు తండ్రి మల్లయ్య, వయస్సు 89 సం॥లు, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఇంటి నెం. 5-34, నిమ్మపల్లి గ్రామం, కోనరావుపేట మండలం, జిల్లా రాజన్న సిరిసిల్ల గారు రెస్పాండెంట్ నెం. 1 వద్ద యున్నటువంటి పెట్టుబడి రూ. 1,42,236/- (అక్షరాల ఒక లక్ష నలుబది రెండు వేల రెండు వందల ముప్పది ఆరు రూపాయలు)లు తీసుకొను నిమిత్తం పై న్యాయస్థానంలో "సర్టిఫికేట్" జారీ కోరుకు పై దావా వేసియున్నారు. ఇట్టి కేసు తేది. 16-04-2024 రోజున పై న్యాయస్థానంలో కలదు. ఇట్టి కేసులో ఎవరికైనను ఏలాంటి అభ్యంతరములు ఉయిన ఉన్నచో తగు దస్తావేజుల ఆధారముగా పై న్యాయ స్థానంలో తేది. 16-04-2024 రోజున ఉ॥ 10-30 ని॥లకు స్వతహాగా కాని లేదా ప్లీడర్ ద్వారా గాని హాజరు అయి జవాబు ఇవ్వగలరు, లేనిచో పిటిషనర్ గారు దాఖలు చేసిన కేసును విచారించి పిటిషనర్ గారికి "సర్టిఫికేట్" జారీ చేయబడునుయని తెలియజేయనైనది.

// న్యాయస్థానం వారి ఉత్తర్వు క్రమము //

తేది. 29-03-2024 స్థలము: సిరిసిల్ల

సం/- యన్. మల్లేష్ యాదవ్ & జి. నరేష్ గౌడ్
అడ్వకేట్స్, సిరిసిల్ల. సెల్ నెం. 9989474676, 9550879121



వెదిరలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామడుగు మండలం వెదిర జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వేదికపై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, రిటైర్డ్ పీఈటీ దొడ్డ లచ్చిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శైలజ, భారతి తదితరులు పాల్గొన్నారు.

– రామడుగు(చొప్పదండి), మార్చి 29

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వర్క్‌షాపు

కరీంనగర్ రూరల్, మార్చి 29: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సమంత ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ మ్యాథమెటిక్స్' అంశంపై ఒక రోజు ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించారు. వక్సెన్ యూనివర్సిటీ హైదరాబాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ రావ్ ముంజం ప్రత్యేక స్పీకర్‌గా హాజరై, విద్యార్థినులకు రోల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ -2030 విజన్ గురించి వివరించారు. అలాగే గీతం యూనివర్సిటీ, హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ నర్సింహస్వామి అబ్జీట్రా, అప్లికేషన్‌పై, రాయిపూర్ నీట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ నీరజ్, డాక్టర్ ఎల్ భాస్కర్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, గణిత శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పీ కవిత, వర్క్‌షాప్ కన్వీనర్ ఎన్ మునీంద్ర, ఫిజికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

వేములవాడ, మార్చి 29: పట్టణంలోని మహాలక్ష్మి వీధి ప్రాంతంలో గల వ్యభిచార గృహాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ నాగేంద్రాచారి నేతృత్వంలో పట్టణ పోలీసులు దాడులు చేశా రు. నలుగురు యువతులను పోలీస్ స్టేషన్‌కు తరలించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని సిరిసిల్లలోని సఖీ సెంటర్‌కు తరలించారు. విచారణ జరిపి వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

వేములవాడ టౌన్, మార్చి 29: రాజన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు వేములవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నగుబోత్ రఘు శుక్రవారం రూ.3.03లక్షల నగదును ఆలయ అధికారులకు అందించారు. భక్తులకు అన్నప్రసాదం కల్పించేందుకు ఈ విరాళాన్ని అందజేస్తున్నానని రఘు వెల్లడించారు.

ఉద్యోగికి నగదు అందజేస్తున్న రఘు

నీటిని విడుదల చేయకపోతే ఆందోళన తప్పదు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, మార్చి29: నియోజకవర్గంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఏప్రిల్ 15లోగా ఎల్ఎండీ నుంచి నీటిని విడుదల చేయాలని, లేకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కనిపించిన జలదృశ్యాలు కాంగ్రెస్ పాలనలో కనుమరుగయ్యాయన్నారు. నాడు మండుటెండల్లోనూ మత్తళ్లు పోసిన చెరువులు, నేడు మార్చిలోనే నోళ్లు తెరిచాయని పేర్కొన్నారు. అంతటా కరువుఛాయలు అలుముకొని పంటలు కండ్ల ముందే ఎండుతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో వరి చేనులు పొట్ట దశలో ఉన్నాయని, వచ్చే 15లోగా నీళ్లు ఇచ్చి వాటిని కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా, జిల్లా కేంద్రంలోనూ పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇక్కడి పంటలను ఎండబెట్టి ఎల్ఎండీ నుంచి నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం వరకు సాగునీరు తరలించడాన్ని హుజూరాబాద్ నియోజకవర్గ రైతుగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ నాయకుడు తులసి లక్ష్మణ మూర్తి, సీనియర్ నాయకుడు పోరెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులున్నారు.

రాత్రి వేళలో అక్రమంగా మట్టి తరలింపు

చందుర్తి, మార్చి 29: తిమ్మాపూర్ శివారు నుంచి రాత్రి వేళలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఈ మట్టి అక్రమ రవాణాపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అక్రమార్కుల దందా రోజురోజుకూ పెరిగిపోతున్నది. శుక్రవారం రాత్రి వేళల్లో ప్రభుత్వ భూమి నుంచి భారీ మొత్తంలో మట్టిని వేములవాడకు తరలించినట్లు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, మట్టి తరలింపుపై ఎవరికీ అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

బీఆర్ఎస్‌కు మనమే బలం.. బలగం

తిమ్మాపూర్, మార్చి 29: బీఆర్ఎస్ పార్టీకి నాటినుంచి యూత్ అండగా నిలబడిందని.. పార్టీకి మనమే బలగం, బలమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, గెల్లు శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో యూత్ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న రోజుల్లో రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదని, నేడు ఎక్కడ చూసినా ఎండిపోయిన పొలాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభ